నెరవేరిన కల.. జీతాలు పెరిగాయిలా..

- ముస్సిపాలిటీ కార్మికులకు ప్రభుత్వ భరోసా
- ఎమ్మెల్యే పార్థసారథి కృషి ఫలితం
- 438 మంది కార్మికులకు జీతాల పెంపు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు మంచి రోజులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు అండగా నిలిచి జీతాలు పెంచింది. పెంచిన జీతాల అమలుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పెనమలూరు మండలంలోని తాడిగడప, యనమలకుదురు, పోరంకి, కానూరు గ్రామాలను విలీనం చేస్తూ తాడిగడప మున్సిపాలిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో ఆర్డినెన్స్ చేసింది. అప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, నాన్ పబ్లిక్ హెల్త్ కార్మికులు, ఇతర సేవలు అందిస్తున్న కార్మికులు ఆయా గ్రామ పంచాయతీల్లో ఉన్న టెండర్ల ఆధారంగా జీతాలకు పని చేశారు. అయితే పెరిగిన అవసరాలకు అనుగుణంగా జీతాలు పెరగక పోవటంతో కార్మికులు ఇబ్బందులు పడసాగారు. అప్పటి టీడీపీ పాలకులు కూడా గ్రామ పంచాయతీల్లో పని చేసిన కార్మికుల జీతాలు పెంచలేదు. అయితే తాడిగడప మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత జీతాలు పెరుగుతాయని కార్మికులు ఆశించినా జీతాలు పెరగలేదు. కానూరులో 192 మంది, తాడిగడపలో 49 మంది, యనమలకుదురులో 89 మంది, పోరంకిలో 108 మంది కలిపి 438 మంది కార్మికులు మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో కనీస వేతనాలు లేకుండా ఇంతకాలం పని చేస్తున్నారు.



తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు

డిజిగ్నేషన్	ప్రస్తుత జీతం	పెంచిన జీతం
పారిశుద్ధ్య కార్మికుడు	రూ.12,000 (సగటు)	రూ.21,000 అలవెన్స్‌తో (15000 + 6000)
డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు	రూ.12000 నుంచి 14000	రూ.18,500
నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు	రూ.12,000	రూ. 15,000

ఎమ్మెల్యే చొరవతో జీతాలు పెంపు..

తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో ప్రభుత్వం న్యాయం చేసింది. కార్మికుల కోరిక మేరకు ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో పని చేస్తున కార్మికులు, సిబ్బందిని ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్స్ సర్వీస్ (ఆప్కాస్) నిబంధనలు అమలు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్కే రోజా, జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో గత డిసెంబర్ నుంచి ఆప్కాస్‌లో కార్మికులకు నిబంధనలు అమలు చేశారు. పెంచిన జీతాలు బకాయిలతో చెల్లిస్తారు. పెంచిన జీతాల వివరాలు నెలకు ఇలా ఉన్నాయి.

పెంచిన జీతాలు చెల్లిస్తాం..



తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులతో పాటు వివిధ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి పెంచిన జీతాలు ఫిబ్రవరిలో ఎరియర్స్‌తో సహా చెల్లిస్తాము. కార్మికులు కోరిక మేరకు ఆప్కాస్ నిబంధనలు అమలు చేస్తున్నాము. కార్మికులు ప్రజలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతతో పని చేయాలి.

– ఎస్.ప్రకాశరావు, తాడిగడప మున్సిపాలటీ కమిషనర్

కానూరు ప్రజలకు కృష్ణా జలాలు

- శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి
- రూ.4.23 కోట్లతో వాటర్ ట్యాంకుల నిర్మాణం
- ఉచిత కుళాయిలకు రూ.17 కోట్లు
- చెరువుల అభివృద్ధికి రూ.1.50 కోట్లు

పెనమలూరు: కృష్ణాజలాలను కానూరు ప్రజలకు అందిస్తామని, ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి కనెక్షన్లు ఇస్తామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గ్రామంలో ఆదివారం శ్రీరామ్‌నగర్, మహదేవపురం కాలనీలో రూ.4.23 కోట్లతో రెండు వాటర్ ట్యాంకులు, ఏడువేల మీటర్ల పైప్‌లైన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కానూరు గ్రామానికి జలజీవన్ మిషన్ పథకం కింద మూడు వాటర్ ట్యాంకులు మంజూరు చేశామన్నారు. ట్యాంకులు, ఏడువేల మీటర్ల పైప్‌లైన్ పనులు వేగంగా పూర్తి చేస్తామని అన్నారు. కానూరులో భూగర్భజలాలు కలుషితంగా మారినందున కృష్ణాజలాలు సరఫరా చేస్తామని తెలిపారు. అమృత్–2 పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మండల పరిధిలో 27500 ఉచిత కుళాయి కనెక్షన్లు ఇస్తామని దీనికి గాను రూ.17 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. కానూరు, పోరంకి చెరువు అభివృద్ధికి రూ.1.50 కోట్లు నిధులు కేటాయించామని వివరించారు. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేస్తామని తెలిపారు.



ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

అభివృద్ధిని చూడండి..

తమ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను టీడీపీ కళ్లు తెరిచి చూడాలని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసి వారి జీవితాల్లో మార్పు తీసుకు వస్తుంటే టీడీపీ బురదజల్లే పని చేస్తుందని మండి పడ్డారు. పేదలపై చంద్రబాబు కక్ష కట్టాడని ఆరోపించారు. టీడీపీ జీవిత కాలంలో చేయని అభివృద్ధి గత మూడేళ్లలో పెనమలూరు నియోజకవర్గంలో చేశామన్నారు. తాము చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు. తాడిగడప మునిసిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, చాంద్‌బాషా, సిద్దిక్, ఖాదర్, రెహమాన్, తాళ్ల నరేంద్ర, వేమూరి బాలకృష్ణ, సైకం శివప్రసాద్, అహ్మద్, ముత్తు, పిన్నబోయిన రవి, సైకం ఏడు కొండలు, కాలిక్, తుమాటి శ్రీరాములు వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో రజతోత్సవ కల్యాణ మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. వందలాది మంది భక్తుల సమక్షంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామికి వివాహం జరిపారు. ఆలయ ప్రాంగణంలోని మహాలక్ష్మీ(మాను)కు పూజలు జరిపి గ్రామ పొంగలి సమర్పించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపైకి శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామిని తీసుకువచ్చారు. పలువురు దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించగా రాత్రి 8.40 గంటలకు సుముహూర్తంలో అమ్మవారికి కల్యాణాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ నిర్వాహకులు జాస్తి శ్రీధర్, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. శ్రీతిరుపతమ్మ, గోపయ్య స్వామికి పలువురు పురప్రముఖులు, భక్తులు పట్టువస్త్రాలను సమర్పించారు.



శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

500 మందికి కంటి పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఆశ్విని ఫౌండేషన్ ఇండియా, అన్నపూర్ణ ఏజెన్సీ అధినేత నూలు నరసింహరావు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి ప్రారంభించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎ.శ్రీనివాస్, డాక్టర్ గీతా శ్రీనివాస్‌లు సేవలు అందించారు. దాదాపు 500 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా, 340 మందికి కళ్లజోళ్లు, మరో 25 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఆశ్విని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరికి ఉచితంగా కళ్లజోళ్లు, కంటి శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు ట్రస్టీ పడాల రమేష్ తెలిపారు. ఇప్పటి వరకు తమ ఫౌండేషన్ ద్వారా 61 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించామని, 30 వేల మందికి స్క్రీనింగ్ టెస్టులు, 17,381 మందికి కళ్లజోళ్లు పంపిణీ, 939 మందికి ఆపరేషన్లు నిర్వహించామని వివరించారు. వైఎస్సార్ సీపీ యువజన నేత దుట్టా రవిశంకర్, జనసేన నాయకులు చలమలశెట్టి రమేష్ బాబు, పీఏసీఎస్ చైర్మన్ చిన్నాల సత్యగణేష్ బాబు, సర్పంచ్ ఎనికేపల్లి సీతమ్మ, మాజీ సర్పంచ్‌లు చిన్నాల మోహర్ లీల, చింతల వెంకట శివ అప్పారావు, దన్నె దుర్గారావు, తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి, ఎస్‌సీఎస్ జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ చింతా భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి ఉమా, ఎనికేపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, బాలాజీ, అన్నం సత్యనారాయణ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

వార్షికోత్సవానికి హనుమాన్ విగ్రహం ముస్తాబు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక సీతారామ దాసాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో 45 అడుగుల ఎత్తైన హనుమాన్ విగ్రహాన్ని 8వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు. ఆలయ వ్యవస్థాపకులు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు దాతల సహకారంతో 45 అడుగుల హనుమాన్ విగ్రహానికి రంగులు వేయిస్తున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లుగా ఆలయ కమిటీ సభ్యులు పల్నాటి మస్తాన్‌రావు, పల్నాటి సాగర్ తెలిపారు.



ముస్తాబవుతున్న హనుమాన్ విగ్రహం

పేకాట శిబిరాలపై దాడులు

కంకిపాడు: పేకాట శిబిరాలపై పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. రెండు వేర్వేరు ప్రాంతాల్లో 18 మంది జూదరులను అరెస్టు చేశారు. అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి కథనం మేరకు ..పునాదిపాడు గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట నిర్వహిస్తున్న సమాచారంతో శనివారం అర్ధరాత్రి సమయంలో దాడులు చేసి 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 54,870 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలోని పంట పొలాల్లో పేకాట శిబిరం దాడుల్లో ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,180 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఉయ్యూరు: మండలంలోని ఆకునూరు శివారు మూర్తిరాజుగూడెం రోడ్డులో పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం దాడి చేశారు. దాడుల్లో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.45300 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి మృతిపై వివాదం?

ఓ వ్యక్తి మృతిపై వివాదం రేగింది. పుట్టగుంటకు చెందిన అప్పారావు అనే వ్యక్తి పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేకాట శిబిరంలో జూదరులను పోలీసులు వెంబడించగా పరుగులు తీసి ఆయాసం రావటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని అప్పారావు తరపు వ్యక్తులు ఆరోపిస్తున్నారు. తాము దాడి చేసి పట్టుకున్న నలుగురిలో అప్పారావు లేరని, నలుగురుని అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై పంపించామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. తామెవరినీ వెంబడించలేదని, అప్పారావు అన్న వ్యక్తి తమకు తెలీదన్నారు. గ్యాస్ నొప్పితో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ ఫిట్స్ రావటంతో అప్పారావు చనిపోయినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

సింధు స్నానాలకు పోటెత్తిన భక్త జనం

కృత్తివెన్ను: పవిత్ర మాఘమాసంలో పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం జరిగిన సింధు స్నానాలకు భక్తులు పోటెత్తారు. మండల పరిధిలోని పెదగొల్లపాలెం, చినగొల్లపాలెం, ఇంతేరు బీచ్‌ల వద్ద భారీగా ప్రజలు స్నానాలు ఆచరించారు. ఆదివారం కావడంతో యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో స్నానాలు చేసినట్లు అధికారులు తెలిపారు. యువత బీచ్ వద్ద వాలీబాల్, కబడ్డీ తదితర ఆటలతో సందడి చేశారు. స్నానాలకు వచ్చే భక్తుల కోసం సంబంధిత అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెదగొల్లపాలెం బీచ్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది.

మంగినపూడి బీచ్‌లో..

కోనేరుసెంటర్: మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఆదివారం భక్తులు సింధు స్నానాలు ఆచరించారు. తెల్లవారు జాము 5 గంటల నుంచే భక్తులు బీచ్‌కు భారీగా తరలివచ్చారు. సముద్రంలో స్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం దత్తాశ్రమంలోని 11 బావుల్లో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సింధు స్నానాలను పురస్కరించుకుని భక్తుల రాకతో మంగినపూడి బీచ్ పోటెత్తింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. భక్తులకు అవసరమైన తాగునీరు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సింధు స్నానాలను పురస్కరించుకుని బందరు సబ్–డివిజన్ తరఫున పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. బందరు డీఎస్పీ మాసూంబాషా బందోబస్తును పర్యవేక్షించారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది బీచ్ వద్ద శానిటేషన్ పనులను పర్యవేక్షించారు.



కృత్తివెన్ను మండలం పెదగొల్లపాలెం వద్ద సింధు స్నానాలకు వచ్చిన భక్తులు

పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలి

పెనమలూరు: పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని చదవాలని అన్నే రామతులసి ట్రస్టు చైర్మన్ అన్నే శివనాగేశ్వరరావు పేర్కొన్నారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాపించిన నాటి నుంచి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన అనేక మంది పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలను నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతో పాటు ఇతర విషయాలను ప్రతి ఒక్క విద్యార్థి శ్రద్ధతో చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.కమల, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు హజరయ్య బాబు, తాళ్లూరి అశోక్, అన్నే రామకృష్ణ, రాజన్ పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు.



ప్రసంగిస్తున్న శివనాగేశ్వరరావు

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

పెనమలూరు: చోడవరం గ్రామంలో 200 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు గ్రామ సర్పంచి కాకర్ల వెంకటరత్నం ఆదివారం పంపిణీ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొన్న సమయంలో లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాలు చూపితే గృహాలు నిర్మించుకుంటామని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి స్థలాలు లబ్ధిదారులకు చూపాలని అధికారులు ఆదేశించారు. దీంతో సర్పంచి కాకర్ల వెంకటరత్నం ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి, కేటాయించిన స్థలాలు చూపారు. లబ్ధిదారులు వెంటనే గృహాలు నిర్మాణం చేసుకోవాలని, ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సర్పంచి వెంకటరత్నం తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఆర్‌ఐ భరద్వాజ్, సర్వేయర్ శివరామకృష్ణ, వీఆర్వో కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు మందూరు కోటేశ్వరరావు, చాగర్లమూడి బాలకోటేశ్వరరావు, చోడవరపు రవిచంద్, కలతోటి ప్రసాదరావు, పొద్దుటూరు రవి పలువురు పాల్గొన్నారు.

నిష్కళంక మాతకు నీరాజనాలు

గుణదల(విజయవాడ తూర్పు): పవిత్ర జీవితాన్ని గడిపిన మరియమాత ప్రపంచ నిష్కళంక మాతగా నీరాజనాలందుకుంటుందని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు పేర్కొన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనలు ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన ప్రార్థనలకు బిషప్ రాజారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరియతల్లి భక్తుల పాలిట కల్పవల్లిగా నిలిచిందన్నారు. ఆమెను ఆశ్రయిస్తే మన కష్టాలు కడతేరి, కోర్కెలు తీరుతాయన్నారు. పరమ పవిత్ర జీవితాన్ని గడిపిన మరియతల్లి దేవుని ఇష్టురాలిగా జీవించిందన్నారు. ఆమె భక్తికి మెచ్చిన దేవుడు మరియతల్లి గర్భవాసాన జన్మించారని పేర్కొన్నారు. మరియతల్లి ద్వారా ఈ లోకానికి అరుదెంచిన క్రీస్తు లోక రక్షకుడిగా మానవాళిని రక్షించారన్నారు. మరియమాత పవిత్రత, ఏసుక్రీస్తు శిలువ త్యాగం ప్రతిఒక్కరూ మననం చేసుకోవాలని తెలిపారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి, భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ విలియం జయరాజ్, ప్రొవెన్షియల్ ఫాదర్ బత్తుల జయరాజు , ఫాదర్ మరియన్న, ఫాదర్ సునీల్ పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

విజయవాడరూరల్: స్థానిక కార్యాలయంలో సోమవారం రూరల్ మండల తహసీల్దారు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ విజయకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్పందన కార్యక్రమంలో అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన అంకమ్మ తల్లి తిరునాళ్ల

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బిళ్లనపల్లిలోని జరగుతున్న అంకమ్మ తల్లి తిరునాళ్ల ఆదివారంతో ముగిసిది. అమ్మవారికి తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. అంకమ్మ తల్లికి కొండపావులూరి వంశస్తులు, ఆడబడుచులు గ్రామ వీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చి కొలువులు సమర్పించారు. గ్రామస్తులు అమ్మవారి పొంగళ్లు, పసుకు, కుంకుమతో నివేదనలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండపావులూరి వెంకట బాబురావు, సభ్యులు మోహన్ కుమార్, హేమంత్ కుమార్, తులసీ రాంప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తల్లి, కొడుకు అదృశ్యం

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో తల్లీ,కుమారుడు అదృశ్యంపై ఆదివారం కేసు నమోదైంది. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపులిపాక శ్రీనగర్ కాలనీకి చెందిన బి.దుర్గాప్రవల్లిక దుర్గాప్రసాద్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. వీరికి నాలుగు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. భర్తతో విభేదాల కారణంగా కొద్ది కాలంగా తల్లి ధనలక్ష్మి వద్ద దుర్గాప్రవల్లిక ఉంటుంది. విజయవాడలో షాపులో పని చేస్తుంది. అయితే ఈ నెల 3వ తేదీన తల్లీ,కుమారుడు ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. ఈ ఘటనపై తల్లి ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో సెంట్రింగ్ సామాను చోరీపై ఆదివారం కేసు నమోదైంది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురుకు చెందిన సెంట్రింగ్ మేస్త్రీ ఆజమ్‌ఖాన్ పెదపులిపాక చిన్నకట్ట రోడ్డులో భవన నిర్మాణానికి సెంట్రింగ్ సామాను తీసుకు వచ్చి ఉంచాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు సెంట్రింగ్ సామగ్రి రెండు రోజుల క్రితం చోరీ చోరీ చేశారు. చోరీ జరిగిన సామగ్రి విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వివాహిత అదృశ్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. ఢిల్లీలో ఉంటున్న కె.కిరణ్మయి కొద్ది సంవత్సరాల క్రితం దుర్గేష్‌ను వివాహం చేసుకుంది. భర్త ఢిల్లీలో కారు ట్రావెల్స్ వ్యాపారం చేస్తాడు. అయితే కిరణ్మయి గత నెల 21వ తేదీన యనమలకుదురులో ఉంటున్న సోదరుడు రమాప్రతాప్ ఇంటికి వచ్చింది. 28వ తేదీన భర్త వద్దకు ఢిల్లీ వెళుతున్నానని చెప్పి వెళ్లింది. అయితే ఆమె ఢిల్లీకి చేరలేదు. దీంతో కిరణ్మయి కనిపించటంలేదని సోదరుడు రమాప్రతాప్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

షాదీఖానా నిర్మాణ పనులు ప్రారంభం

పెనమలూరు: గంగూరులో షాదీఖానా నిర్మాణ పనులను ఆదివారం పునఃప్రారంభించారు. ఇందుకు ప్రధాన అవసరమైన బోరు ఏర్పటుకు శ్రీకారం చుట్టారు. సర్పంచి తస్లీమున్నీసా తెలిపిన వివరాల ప్రకారం.. గంగూరులో షాదీఖానా నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరటంతో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి రూ.కోటి నిధులు మంజూరు చేశారన్నారు. చాలా సంవత్సరాలుగా ముస్లింలు ఎదురు చూస్తున్న షాదీఖానా, ఉర్దూ ఘర్ పనులు, బోరు పనులు ప్రారంభించారు. సాధ్యమయినంత త్వరగా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు అక్బర్ బాషా, బాబూరావు, అజీజుల్లాఖాన్, ఇస్మాయిల్ షరీఫ్, గని, మోయుద్దీన్, రిజ్వాన్‌బేగ్, జానీ,అమర్, యూసుఫ్ పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో మాఘ పౌర్ణమి సందర్భంగా సూర్యనారాయణస్వామికి ఆదివారం అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు చేసి, అరుణపారాయణ అనంతరం పొంగలి నివేదన చేశారు. నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి విశేషమైన పూజలు జరిపారు. సుబ్రహ్మణ్యస్వామికి అలంకరాలు చేసి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గుడివాడ నుంచి వచ్చిన భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో శ్రీకోదండరామ మందిరం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, శ్రీగంగానమ్మ తల్లి మహామండపం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత మండప పూజలు, దీక్షాహవనం, అధివాసహవనం ప్రత్యేక జరిపారు. ఉదయం 9.14 గంటలకు శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. స్వామివారి దివ్య దర్శనం అనంతరం మహాపూర్ణాహుతి, భక్తులకు అన్నసమారాధన చేశారు. నూతనంగా నిర్మించిన శ్రీగంగానమ్మ తల్లి మహామండపాన్ని ప్రారంభించారు. శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ దాత మార్పిని కేశవరావు, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అరుణ పారాయణ హోమం



గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్పురంలో ఆదివారం పుష్య ఆర్క పర్వదినం పురస్కరించుకుని మహా అరుణ పారాయణ సహిత సౌరహోమాలు నిర్వహించారు. ఆయుష్షు, ఆరోగ్యం, ఐశ్వర్యాలు ఈ హోమాల వల్ల లభిస్తాయని వేద పండితులు భక్తులకు ఉపదేశించారు. ఆలయ నిర్వాహకులు వంశీ ఆధ్వర్యంలో హోమాలు జరిగాయి. పలువురు దంపతులు ఈ హోమాల్లో పాల్గొన్నారు. ఆలయ భక్తుల కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఈఓ



ఉయ్యూరు: ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉయ్యూరు పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. జెడ్పీ పాఠశాలలో 240 మంది విద్యార్థులకు 232 మంది, ఫ్లోరాలో 240కు 233 మంది, వీఆర్‌కేఎంలో 192 మందికి 182 మంది, నారాయణలో 155కు 148 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను డీఈఓ తాహెరా సుల్తానా సందర్శించి తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈఓ తెలిపారు.

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

ఉంగుటూరు: రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పి కొట్టాలని పీవీ రావు మాల మహానాడు ఉభయ కృష్ణా జిల్లాల అధ్యక్షుడు గోగులమూడి రాజు పిలుపునిచ్చారు. పెద అవుటపల్లిలో నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంథోని ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న కుట్రలను తరిమికొట్టేందుకు మాలలు ఐక్యంగా నిలబడి పోరాటం చేయాలని అన్నారు. మాలల అభ్యున్నతికి పాలకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, ప్రసాద్, అజయ్‌బాబు, రాంబాబు పాల్గొన్నారు.